సాక్షి ఏలూరు

బుధవారం । 31 । జనవరి । 2024



కలెక్టర్‌ను కలిసిన రాజేంద్రన్

ఏలూరు (మెట్రో): నూజివీడు సబ్ కలెక్టర్‌గా పనిచేసి నెల్లూరు జేసీగా పదోన్నతి పొందిన ఆదర్శ రాజేంద్రన్ మంగళవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిశారు.



రొయ్య సీడ్ సంరక్షణకు చర్యలు

త్వరలో విశాఖ జిల్లాలో రొయ్య సీడ్ సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం తాడేపల్లిగూడెంలో చెప్పారు. 8లో ▸



తండ్రీ కొడుకుల దుర్మరణం

రావులపాలెంలో ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆకివీడుకు చెందిన తండ్రీ కొడుకులు దుర్మరణం పాలయ్యారు. 8లో ▸

న్యూస్‌రీల్

సింగిల్ విండోలో 283 దరఖాస్తులకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఏలూరు (మెట్రో): పరిశ్రమల ఏర్పాటుకు చేసుకునే సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టు, దరఖాస్తుల్లో లోటుపాట్లపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్లో అవగాహన పెంపొందించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాలు మంజూరుకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందుకు తగిన విధంగా అధికారులు, బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండో పథకం ద్వారా 297 దరఖాస్తులు అందగా, వాటిలో 283 దరఖాస్తులు వివిధ శాఖల ద్వారా ఆమోదించడం జరిగిందన్నారు. మిగిలిన దరఖాస్తులను కూడా నిర్దేశించిన సమయంలోగా ఆమోదించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ కింద జిల్లాలోని 8 మంది ఎంఎస్ఎంఈ, వై.ఎస్.ఆర్. బడుగు వికాసం యూనిట్లకు రూ.55.40 లక్షల ప్రోత్సాహకాలను మంజూరు చేస్తూ సమావేశం తీర్మానించింది.

భద్రత పటిష్టం చేయాలి

ఏలూరు (మెట్రో): జిల్లాలో వివిధ పరిశ్రమల్లో అగ్నిమాపక మార్గదర్శకాలకు అనుగుణంగా భద్రతా చర్యలు తీసుకోకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా క్రైసిస్ గ్రూప్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల్లో భద్రతా చర్యలు తీసుకునేందుకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారని, మరోసారి 15 రోజుల పనిదినాల గడువుతో ఆయా పరిశ్రమల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేయాలని జిల్లా ఫైర్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. అప్పటికీ యాజమాన్యాలు స్పందించని పక్షంలో సెక్షన్-12 కింద కేసు నమోదుకు చర్యలు చేపట్టాలన్నారు.

గంజాయి రవాణాపై నిఘా

ఏలూరు (మెట్రో): గంజాయి రవాణాపై నిఘా పెంచడంతోపాటు గంజాయి తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు. మంగళవారం నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్‌డీ) జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఎస్పీ డి.మేరీప్రశాంతితో కలిసి కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు జిల్లా యంత్రాంగం తరఫున ఏవిధమైన సహకారం అవసరమో తదుపరి నెలలో నిర్వహించే సమావేశం నాటికి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో గంజాయి రవాణా, సరఫరా, వినియోగం నియంత్రణలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు.

విజయీభవ

ఇంటర్మీడియట్ పరీక్షలు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ప్రత్యేకంగా విజయీభవ కార్యక్రమాన్ని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు అమలు చేస్తున్నారు. మెరిట్ విద్యార్థులతో పాటు చదువులో వెనుకబడిన విద్యార్థులపై కూడా ఈ కార్యక్రమం ద్వారా ప్రతేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటికే నిర్వహించిన నాలుగు యూనిట్ టెస్టులు, క్వార్టర్లీ, హాఫ్‌ఇయర్లీ పరీక్షల్లో విద్యార్థుల ఫలితాలను పరిగణనలోకి తీసుకుని ప్రతిభావంతులైన విద్యార్థులను మరింత ప్రోత్సహిస్తూ, వెనుకబడిన వారికి సరైన మార్గనిర్దేశం చేస్తున్నారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 29వ తేదీ వరకు కొనసాగనుంది.

- ఇంటర్‌లో ఉత్తీర్ణత మెరుగుదలకు ప్రత్యేక కార్యక్రమం
- ఈ నెల 10 నుంచి అమలు చేస్తున్న ఇంటర్ బోర్డు
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ఫిబ్రవరి 1, 3 వారాల్లో అంతర్గత పరీక్షల నిర్వహణ



ప్రత్యేక తరగతిలో పాఠ్యాంశాలు అభ్యసిస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి జిల్లాలో జూనియర్ కళాశాలల్లో 50 రోజుల పాటు విజయీభవ కార్యక్రమాన్ని అమలు చేయడానికి కార్యాచరణ రూపొందించారు. ప్రతి రోజూ ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు ముగిసే తరగతులను 50 రోజుల పాటు ఉదయం 9 గంటల నుంచి ప్రారంభించి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిస్తున్నారు. ఈ విజయీభవ కార్యక్రమంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్, సబ్జెక్టు లెక్చరర్లు వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటున్నారు. అలాగే 5-6 మంది విద్యార్థులను ఒక అధ్యాపకుని అప్పగించి ఆయా విద్యార్థులకు సలహాదారుగా వ్యవహరిస్తూ, తద్వారా విద్యార్థులను విజయం సాధించే దిశగా ప్రేరేపించి ప్రోత్సహిస్తున్నారు. వచ్చే నెలలో మొదటి, మూడో వారంలో మరిన్ని అంతర్గత పరీక్షలు నిర్వహించి విద్యార్థుల పురోగతిని పునఃసమీక్షించి అప్పటికీ వెనుకబడిన విద్యార్థులకు సాన బెట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు.

127 కళాశాలల నుంచి 15656 మంది విద్యార్థులు

గత విద్యా సంవత్సరంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాతిపదికగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించగా ప్రస్తుత 2023-24 విద్యా సంవత్సరంలో విభజిత జిల్లాల ప్రాతిపదికగా పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఏలూరు జిల్లాలో ఈ ఏడాది మొత్తం 127 కళాశాలల నుంచి 15,656 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో ప్రభుత్వ కళాశాలల నుంచి 1,653 మంది, హైస్కూల్ ప్లస్‌ల నుంచి 229 మంది, కస్తూరిబా బాలికా విద్యాలయాల నుంచి 47 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. వీరితో పాటు ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలల నుంచి 323 మంది, సాంఘిక సంక్షేమ కళాశాలల నుంచి 449 మంది, గిరిజన సంక్షేమ కళాశాలల నుంచి 330 మంది పరీక్షలు రాయనుండగా అత్యధికంగా ప్రైవేట్, అన్ ఎయిడెడ్ కళాశాలల నుంచి 12,625 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.

థియరీ పరీక్షల షెడ్యూల్

ప్రథమ సంవత్సరం

మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 1వ తేదీన సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1 పరీక్ష, 4న ఇంగ్లిష్ పేపర్-1, 6న గణితం-1ఏ, బోటనీ, సివిక్స్ పరీక్షలు, 9న గణితం-1బీ, జువాలజీ, హిస్టరీ, 12న ఫిజిక్స్, ఎకనామిక్స్, 14న కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్, 16న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జి కోర్సు గణితం (బైపీసీ విద్యార్థులకు), 19వ తేదీన మోడరన్ లాంగ్వేజ్, జాగ్రఫీ పరీక్షలు జరుగుతాయి.

ద్వితీయ సంవత్సరం

ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 2వ తేదీన సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2 పరీక్ష, 5న ఇంగ్లిష్ పేపర్-2, 7న గణితం-2ఏ, బోటనీ, సివిక్స్ పరీక్షలు, 11న గణితం-2బీ, జువాలజీ, హిస్టరీ, 13న ఫిజిక్స్, ఎకనామిక్స్, 15న కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్, 18 పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జి కోర్సు గణితం (బైపీసీ విద్యార్థులకు), 20వ తేదీన మోడరన్ లాంగ్వేజ్, జాగ్రఫీ పరీక్షలు జరుగుతాయి.

ఫిబ్రవరి 2 నుంచి పరీక్షలు

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి నెల 1వ తేదీ నుంచి ప్రారంభంకానుండగా సాంకేతికంగా ఫిబ్రవరి 2వ తేదీ నుంచే ప్రారంభంకానున్నాయి. దీనిలో భాగంగా ఫిబ్రవరి 2వ తేదీన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, 3న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహించనున్నారు. అలాగే సమగ్రశిక్ష ఒకేషనల్ బ్రిడ్ పరీక్ష ఫిబ్రవరి 22వ తేదీన జరుగుతుంది. కాగా ఇంటర్మీడియట్ పరీక్షల్లో మరో ప్రధానాంశమైన ప్రయోగ పరీక్షలు సాధారణ విద్యార్థులకు ఫిబ్రవరి 11వ తేదీ నుంచి 20 వరకూ నిర్వహించనుండగా, ఒకేషనల్ విద్యార్థులకు ఫిబ్రవరి 5 నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి.

ఉత్తీర్ణత శాతం మెరుగుపడేలా చర్యలు



ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు విజయీభవ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక కార్యాచరణతో అమలు చేస్తున్నాం. 50 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి మంచి ఫలితాలు సాధించే దిశగా సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్, సబ్జెక్టు అధ్యాపకులకు తగిన సూచనలు చేశాం. విద్యార్థి ఏ సబ్జెక్టులో వెనకబడి ఉన్నాడో ఆ సబ్జెక్టు అధ్యాపకుడు ఆ విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని సూచించాం. ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తూ ప్రథమ సంవత్సరంలో మిగిలి ఉన్న సబ్జెక్టుల్లో కూడా విద్యార్థి ఉత్తీర్ణుడు కావడానికి సమయం వెచ్చించేలా షెడ్యూల్ రూపొందించాం. ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థుల ఉత్తీర్ణతలో జిల్లా రాష్ట్ర స్థాయిలో మరింత ప్రగతి సాధించేలా పనిచేస్తున్నాం.

– బి.ప్రభాకర్, జిల్లా వృత్తివిద్యా అధికారి

సీఎం సభకు ఏర్పాట్లు ముమ్మరం



సీఎం సభ వద్ద నిర్మించిన భారీ గ్యాలరీ

దెందులూరు: దెందులూరు సహారా గ్రౌండ్స్‌లో ఫిబ్రవరి 3వ తేదీన నిర్వహించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే 'సిద్ధం' బహిరంగ సభకు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. కృష్ణా జిల్లా, ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి వచ్చే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల కోసం ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. సీఎం సభాస్థలికి వెనుక వైపు హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం ఉదయం కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ, ఏలూరు ఆర్డీఓ ఖాజావలీ, దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య ఏర్పాట్లను పరిశీలించారు. హెలీప్యాడ్ నిర్మాణానికి సంబంధించి పలు సూచనలు చేశారు. హెలీప్యాడ్ వద్ద సీఎం, సీఎం సభాస్థలి వద్ద జేసీబీలతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మరోవైపు బహిరంగ సభకు హాజరయ్యే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల కోసం వందలాది మంది కార్మికులతో నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

జేఈఈ మెయిన్స్‌కు 728 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్-1 పరీక్షలకు మంగళవారం 728 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు సిద్ధార్థ క్వెస్ట్‌లో 180 మంది, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో 100 మంది, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 85 మంది హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం పరీక్షలో సిద్ధార్థ క్వెస్ట్‌లో 183 మంది, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో 97 మంది, సీఆర్ఆర్‌లో 83 మంది హాజరయ్యారు.

ఎన్ని కుట్రలు చేసినా జగనన్న గెలుపు తథ్యం

- షర్మిలను రంగంలోకి దింపి నోటికొచ్చినట్టు మాట్లాడిస్తున్నారు
- రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వనిత

ద్వారకాతిరుమల: రాజు బలవంతుడైతే శత్రువులంతా ఒక్కటవుతారు.. అలాగే రాజకీయాల్లో రాజైన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు శత్రువులంతా ఒకటయ్యారని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత ఎద్దేవా చేశారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని కాపు కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన మండల నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ జగనన్నను ఎదుర్కొనేందుకు ప్రతి పక్షాలు పీసీసీ చీఫ్ షర్మిలను కూడా రంగంలోకి దింపారన్నారు. ఏ కుటుంబంలో అయినా గొడవలు ఉండటం సహజమేనని, దాన్ని కూడా టీడీపీ రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. టీడీపీకి కంచుకోట అయిన గోపాలపురం నియోజకవర్గాన్ని కాపాడుకునేందుకు ఆ పార్టీ నేతలు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా తానే విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

దూబచర్ల నుంచి ద్వారకాతిరుమల వరకు శ్రీవారి భక్తులు పాదయాత్రగా వచ్చే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం మంత్రి తానేటి వనిత శంకుస్థాపన చేశారు. దూబచర్ల వద్ద కొబ్బరికాయ కొట్టి, శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దూబచర్ల నుంచి ద్వారకాతిరుమలకు వెళ్లే ఈ రహదారిని పంచాయతీ రాజ్ శాఖ నిధులు రూ.6.26 కోట్ల అంచనా వ్యయంతో 9 కి.మీ మేర నిర్మిస్తున్నామన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

- ఫిబ్రవరి 3న ఏలూరులో సన్నాహక సభ
- ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని



ఏలూరు పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రంలో పేద ప్రజలకు సంక్షేమం అందుతుందని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటే జగనన్నతోనే సాధ్యమని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో 'సిద్ధం' సభ సన్నాహక కార్యక్రమానికి సంబంధించి ఏలూరు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, 50 మంది కార్పొరేటర్లతో ప్రత్యేకంగా మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఫిబ్రవరి 3న దెందులూరు నియోజకవర్గంలోని ఏలూరు జాతీయ రహదారిపై ఆశ్రం కళాశాల సమీపంలో సహారా గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ఎన్నికల సన్నాహక భారీ సభకు నియోజకవర్గంలో ఏ విధంగా ఏర్పాట్లు చేయాలనే అంశాలపై పార్టీ నేతలతో ఆయన చర్చించారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌తో కలిసి ఏర్పాట్లపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా దుష్టశక్తులను ఏకమవుతున్నాయని, వాటిని ప్రజాబలంతో ఢీకొట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సిద్ధమయ్యారన్నారు. ప్రతి డివిజన్ నుంచి కార్పొరేటర్లు, నాయకులు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులను తీసుకువెళ్లేలా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో నిర్వహించే ఎన్నికల సన్నాహక సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల భేరీ మోగించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారన్నారు. మేయర్ షేక్ నూర్జహాన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు పాల్గొన్నారు.

అతివల అభ్యున్నతికి ఆసరా

జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేస్తామన్న హామీని అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి మహిళల ఆర్థికాభ్యున్నతికి ఆసరాగా నిలిచారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రుణమాఫీ జరగడంతో డ్వాక్రా మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఆచంట, నూజివీడు నియోజకవర్గాల్లో నాలుగో విడత ఆసరా చెక్కులను అందజేశారు.

– పెనుగొండ/నూజివీడు



నూజివీడులో ఆసరా నాలుగో విడత వారోత్సవాల కార్యక్రమానికి హాజరైన డ్వాక్రా మహిళలు

మహిళల అర్థికాభివృద్ధికి జగన్ కృషి

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన రుణమాఫీ హామీని పూర్తి స్థాయిలో అమలు చేసి డ్వాక్రా మహిళల్లో సంతోషాన్ని నింపారు.

– మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, నూజివీడు ఎమ్మెల్యే

(నూజివీడులో జరిగిన ఆసరా నాలుగో విడత కార్యక్రమంలో..)



నూజివీడులో రుణమాఫీ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

పాల వ్యాపారం చేపట్టా



నేను శ్రీసాయి మహిళా సంఘంలో సభ్యురాలిని. మా సంఘానికి ఆసరా పథకం కింద రూ.6 లక్షల రుణమాఫీ జరిగింది. నాకు రుణమాఫీ ద్వారా అందిన రూ.60 వేలు, అలాగే సున్నా వడ్డీ కింద వచ్చిన రూ.20 వేలతో పాల వ్యాపారం చేసుకుంటున్నా. అంతేగాక ఈ నాలుగేళ్లలో అమ్మఒడి, వసతి దీవెన, విద్యాదీవెన పథకాల ద్వారా కూడా లబ్ధి అందింది. నా భర్త రెండు సార్లు జగనన్న తోడు కింద రూ.10 వేల రుణం తీసుకుని ఆకుకూరల వ్యాపారం చేసుకుంటున్నాం. దీంతో మాకు ఆర్థిక ఇబ్బందులు తీరాయి. అన్నివిధాలా మా కుటుంబాన్ని ఆదుకున్న జగనన్నను మళ్లీ సీఎం చేసుకుంటాం.

– కేమిశెట్టి ఉదయశ్రీ, గొడుగువారిగూడెం, నూజివీడు

రూ.4.80 లక్షల రుణమాఫీ



మా గ్రూపునకు రూ.4.80 లక్షల రుణమాఫీ అయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలుపుకుంటూ పూర్తి స్థాయిలో రుణమాఫీ చేసి అక్కాచెల్లెళ్లకు అండగా నిలిచారు. గత ప్రభుత్వంలో రుణమాఫీ చేస్తామని చంద్రబాబు మహిళలను మోసం చేశారు. రూ.10 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మహిళలను ఆదుకున్న సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలుస్తాం.

– కాళ్ల దుర్గ, కవిటం, పోడూరు మండలం

కులమత వర్గాలకు అతీతంగా పరిపాలన



రాష్ట్రంలో కులమత వర్గాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారు. ఎటువంటి పైరవీలు లేకుండా రుణమాఫీ సొమ్ము నేరుగా మహిళల బ్యాంక్ ఖాతాలకు జమ చేశారు. దీని కోసం ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అందించారు. ఆసరా నాలుగో విడతలో రూ.17 వేలు రుణమాఫీ సొమ్ము అందింది.

– చిలుకూరి వరలక్ష్మి, ఆచంట వేమవరం, ఆచంట మండలం

ఆలయ ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు పెంపు

ద్వారకాతిరుమల: రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో పనిచేసే సిబ్బంది ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో జారీ చేసింది. వివరాల్లోకి వెళితే.. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది క్రితం ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచుతూ జీవో జారీ చేయగా, ఆ జీవో దేవదాయశాఖ ఉద్యోగులకు వర్తింపజేయలేదు. దీంతో కొందరు ఉద్యోగులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉంటే ఉద్యోగుల విన్నపాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం వైఎస్ జగన్ దేవదాయశాఖ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచుతూ శాసనసభలో తీర్మానం చేశారు. దీనికి సంబంధించిన జీవో ఎంఎస్ నంబర్ 37ను జారీ చేశారు. 2023 జులై 12 నుంచి ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని జీవోలో పేర్కొన్నారు. దీని ప్రకారం ద్వారకాతిరుమల దేవస్థానంలో ముగ్గురు ఉద్యోగులు పదవీ విరమణ పొందనున్నారు.

క్లుప్తంగా

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన ప్రసన్నగంటి మరియన్న

టి.నరసాపురం: నిర్మాణం జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేపై టి.నరసాపురం సమీపంలో టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల ప్రకారం.. స్థానిక పెద్ద చెరువు సమీపంలో కూలి పని నిమిత్తం మోటార్‌సైకిల్‌పై పొలానికి వెళుతున్న ప్రసన్నగంటి మరియన్న(45)ను మట్టి తరలిస్తున్న టిప్పర్ మంగళవారం ఢీకొంది. ఈ ప్రమాదంలో మరియన్న అక్కడికక్కడే మృతిచెందాడు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబానికి జీవనాధారమైన మరియన్న మృతి చెందడంతో నష్టపరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో టి.నరసాపురం ప్రధాన సెంటర్‌లో నష్టపరిహారాన్ని డిమాండ్ చేస్తూ రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఘటనా స్థలాన్ని జీలుగుమిల్లి సీఐ క్రాంతికుమార్ సందర్శించారు.

అక్రమ మద్యం పట్టివేత



మద్యం సీసాలను స్వాధీన పరుచుకున్న ఎస్సై జయబాబు

కామవరపు కోట: అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను పట్టుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తడికలపూడి ఎస్సై జయబాబు తెలిపారు. వివరాల ప్రకారం ఆడమిల్లి గ్రామంలో కాట్రు ధర్మరాజు ఇంటిలో అక్రమంగా మద్యం ఉన్నట్లు ముందస్తు సమాచారం ప్రకారం మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఓల్డ్ టైమర్ కంపెనీకి చెందిన 180 ఎంఎల్ కలిగిన 30 మద్యం సీసాలు స్వాధీన పరుచుకుని, అతనిపై కేసు నమోదు చేశారు.

రైస్ మిల్లర్ శ్రీరామరాజుకు మాతృవియోగం



సామంతపూడి వెంకట విజయలక్ష్మి(ఫైల్)

భీమవరం: జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సామంతపూడి శ్రీరామరాజు మాతృమూర్తి సామంతపూడి వెంకట విజయలక్ష్మి(87) మంగళవారం మృతిచెందారు. ఈమెకు ఇరువురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విజయలక్ష్మి మృతి పట్ల పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

సంక్షేమ శకం

ఆరోగ్యశ్రీ తోడుగా నిలిచింది



ఆరోగ్యశ్రీ మాకు తోడుగా నిలిచింది. నా కుమార్తె ప్రసవం కోసం నూజివీడులోని జీఎంహెచ్ఏ హాస్పటల్‌లో జాయిన్ చేశాం. ఆపరేషన్ చేసినప్పుడు మా అమ్మాయికి తక్కువ బరువుతో ఉన్న బిడ్డ పుట్టాడు. దీంతో బిడ్డను 20 రోజుపాలపాటు బాక్సులో ఉంచారు. ఇందుకోసం రూ.1.50 లక్షల వరకు ఖర్చు అయ్యింది. అంతా ఆరోగ్యశ్రీ ద్వారానే చేయడంతో మా దగ్గరి నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. అలాగే రుణమాఫీ పథకం ద్వారా నాకు రూ.62వేలు రుణమాఫీ అయింది. వైఎస్సార్ చేయూతలో రెండు విడతలుగా రూ.37,500 అందాయి. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– మేదూరి ఝాన్సీరాణి, నూజివీడు

వ్యాపారానికి చేయూత



కిరాణా షాపు పెట్టుకోవడానికి మెప్మా ద్వారా లక్ష రూపాయల రుణం ఇచ్చారు. ఇంటి వద్ద చిల్లర కొట్టు నడుపుకుంటూ నెలకు రూ.3 వేలు బ్యాంకుకు చెల్లిస్తున్నా. అలాగే చేయూత పథకం కింద మూడు విడతలుగా రూ.18,750 చొప్పున ఇచ్చారు. అంతేకాకుండా రుణమాఫీ ద్వారా నాకు రూ.56 వేల రుణమాఫీ జరిగింది. నా భర్త ఆటో నడుపుతుండడంతో వాహనమిత్ర పథకం కింద రూ.10వేలు వస్తున్నాయి. జగనన్ననే మళ్లీ సీఎంగా చేసుకుంటాం.

– బేతే కుమారి, ఎన్టీఆర్ కాలనీ, నూజివీడు

ప్రతి కుటుంబానికీ మేలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి మేలు చేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు రుణమాఫీ చేసి మహిళలకు అండగా నిలిచారు. అమ్మఒడి, చేయూత, ఆసరా ఇలా ఎన్నో పథకాల ద్వారా పేదలను ఆదుకుంటున్నారు. జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుంటాం. ఎన్నికల్లో మాట ఇచ్చి మోసం చేసేవారికి తగిన బుద్ధి చెబుతాం.

–కంబాల అనంతలక్ష్మి, పెనుగొండ, పెనుగొండ మండలం

రబీకి ఢోకా లేదు

- తమ్మిలేరు నుంచి నీటిని విడుదల చేస్తున్న ఇరిగేషన్ శాఖ
- 4,500 ఎకరాలకు రబీ సాగు నీరు
- ఈ ఏడాది పూర్తిగా నిండిన ప్రాజెక్టు

చింతలపూడి: జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టు తమ్మిలేరు నుంచి రబీ పంటకు 4,500 ఎకరాలకు సాగు నీరు విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఇటీవల జరిగిన జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశంలో అధికారులు తీర్మానించారు. దీంతో ఈనెల 11వ తేదీ నుంచి రబీకి నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 341.17 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. జలాశయం పూర్తి సామర్థ్యం 355 అడుగులు. గత ఏడాది డిసెంబర్ నెలలో తుపాను ప్రభావంతో కురిసిన అధిక వర్షాలకు జలాశయంలో పూర్తిస్థాయిలో నీరు చేరింది. ప్రాజెక్టు కింద ఏలూరు జిల్లాలో 9,169 ఎకరాలు అధికారికంగా సాగు చేస్తున్నారు. ఆయకట్టు రైతులు వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకుంటే ఇచ్చే నీరు సరిపోతుందని ఇరిగేషన్ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

పూర్తిస్థాయిలో నిండిన ప్రాజెక్టు

గత ఏడాది కురిసిన వర్షాలకు జలాశయంలోకి పూర్తిస్థాయిలో నీరు చేరింది. రాష్ట్ర విభజనతో గత 8 ఏళ్లుగా జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీటిపై రెండు జిల్లాల రైతులు ఆశలు వదులుకున్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు నిర్మించిన నాటి నుంచి రిజర్వాయరు ఎగువ భాగంలో 20 వేల ఎకరాలు, దిగువ భాగంలో ఏలూరు వెళ్లే కాల్వకు ఇరుపక్కలా 15 ఏటి కాలువల ద్వార 14,200 ఎకరాలు సాగవుతున్నాయి. జిల్లాలోని తలార్లపల్లి, యర్రంపల్లి, యడవల్లి, కళ్యాణంపాడు, తువ్వచెలక రాయుడుపాలెం గ్రామాలకు చెందిన 475 ఎకరాల పల్లం భూములకు, 3,769 ఎకరాల మెరక భూములకు నీటి సరఫరా జరుగుతోంది. అదే విధంగా జిల్లాల పునర్విభజనతో ఏలూరు జిల్లాలో చేరిన పోలవరం, చాట్రాయి, తుమ్మగూడెం, మంకొల్లు, సోమవరం గ్రామాల్లో 1,855 ఎకరాల పల్లం భూములకు, 3,070 ఎకరాల మెరక భూములకు సాగునీరు లభిస్తోంది.



తమ్మిలేరు ప్రాజెక్టు నిండుకుండలా జలకళతో ఉట్టిపడుతున్న దృశ్యం

ప్రాజెక్టు ఆయకట్టుకు నీటి విడుదల వివరాలు

1991–92 నుంచి తమ్మిలేరు ప్రాజెక్టు నుంచి ప్రాజెక్టు ఆయకట్టుకు విడుదల చేసిన నీటి వివరాలను ఒక్కసారి పరిశీలిస్తే..



తమ్మిలేరు జలాశయం నుంచి ఆయకట్టుకు సాగు నీరు అందించే కుడి కాల్వ

1991–92 సంవత్సరంలో 2.091 టీఎంసీలు, 1992–93లో 1.256 టీఎంసీలు, 93–94 లో 0.146 టీఎంసీలు, 1994–95 లో 1.141 టీఎంసీలు, 1995–96లో 1.311 టీఎంసీలు, 1996–97 లో 1.552 టీఎంసీలు, 1997–98 లో 0.875 టీఎంసీలు, 1998–99 లో 1.417 టీఎంసీలు, 1999–2000లో 0.949 టీఎంసీలు, 2000–01లో 1.095 టీఎంసీలు, 2001–02 నుంచి 2003–04 వరకు – నిల్, 2004–05 లో 1.012 టీఎంసీలు, 2005–06 లో 1.316 టీఎంసీలు, 2006–07 లో 2.526 టీఎంసీలు, 2007–08 లో 1.327 టీఎంసీలు, 2008–09 లో 2.147 టీఎంసీలు, 2009–10 లో నిల్, 2010–11లో 2.091 టీఎంసీలు, 2011–12లో 0.798 టీఎంసీలు, 2012–13 లో 1.055 టీఎంసీలు, 2013–14లో 2.017 టీఎంసీలు, 2014–15 లో 0.855 టీఎంసీలు, 2015–16లో 0.004 టీఎంసీలు, 2016–17 లో 1.727 టీఎంసీలు , 2017–18లో 1.586 టీఎంసీలు, 2018–19 లో 1.308 టీఎంసీలు, 2019–20లో 0.600 టీఎంసీలు, 2021–22లో 1.5 టీఎంసీలు, 2022–23లో 0.58 టీఎంసీల నీరు ఆయకట్టుకు విడుదల చేశారు.

రబీకి ఇబ్బంది లేదు



ప్రాజెక్టులో ఉన్న నీటి సామర్థ్యాన్ని దష్టిలో పెట్టుకుని రైతుల అభ్యర్థన మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా ఇరిగేషన్ ఎస్‌ఈల ఆదేశాలతో రబీలో సుమారు 4,500 ఎకరాలకు సాగు నీరు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి రబీకి నీరు విడుదల చేస్తున్నాం.

– బి శ్రీనివాసరావు, డీఈ, ,తమ్మిలేరు ప్రాజెక్టు

ఏపీలో బ్రూడ్ స్టాక్ క్వారంటైన్

అప్సడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం



అప్సడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాంను గజమాలతో సన్మానించిన ఉభయ గోదావరి జిల్లా ఆక్వా రైతులు

తాడేపల్లిగూడెం: ఆక్వా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రొయ్యసీడ్ సంరక్షణ నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లాలో బ్రూడ్‌స్టాక్ క్వారంటైన్ సెంటర్‌ను ఏర్పాటుచేయనున్నట్టు అప్సడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం తెలిపారు. మంగళవారం తాడేపల్లిగూడెంలో తనను కలిసేందుకు వచ్చిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఆక్వా రైతులతో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో ఏనాడు జరగని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రత్యేక శ్రద్ధతో ఆక్వా రంగం రాష్ట్రంలో అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఆక్వా నిమిత్తం ఇటీవలి కాలంలో 4,600 కనెక్షన్లు ఇచ్చి, అదనంగా 1500 ఎకరాలను ఆక్వా కల్చర్‌లో ప్రభుత్వం కలిపిందన్నారు. ఒకొక్కటిగా ఆక్వా రంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తూ వస్తుందన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే, వాటిని కూడా చిత్తశుద్ధితో పరిష్కరిస్తామని రఘురాం అప్సడా తరుపున హామీ ఇచ్చారు. అప్సడా వైస్‌చైర్మన్‌గా ఉన్న రఘురాంకు క్యాబినెట్ ర్యాంకు ఇచ్చిన సందర్భంగా ఆక్వా రైతు సంఘ నేతలు ఆయన్ని గజమాలలతో సత్కరించారు.

గాంధీజీ ఆశయ సాధనకు కృషి



గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు (మెట్రో): గాంధీజీ ఆశయ సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో స్థాయి సంఘం వారీగా జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని అమలు పరిచిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, మంచినీటి సౌకర్యం, తదితర ప్రాధాన్యత పనులను చేపట్టి గ్రామప్రజలకు ఎంతో మేలు చేశారని అన్నారు. త్వరలో సార్వత్రి ఎన్నికలు రాబోతున్న సందర్భంగా స్థాయి సంఘం సమావేశం చివరిసారిగా నిర్వహించుకుంటున్నామని, అదే విధంగా ఫిబ్రవరి 10వ తేదీన జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లా పరిషత్ సంఘ సభ్యుల సమావేశానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. ఏ కారణం చేతనైనా రానిపక్షంలో ముందుగానే జెడ్పీ సీఈఓకి సమాచారం అందించాలని అన్నారు. అనంతరం ఈ సమావేశంలో ప్రణాళిక, ఆర్థిక గ్రామీణాభివృద్ధి, విద్యా, వైద్య, మహిళ, సాంఘిక సంక్షేమ స్థాయి సంఘాల సభ్యులు, అధికారులతో ప్రగతి పురోగతిపై సమీక్ష చేశారు. తొలుత జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్. సుబ్బారావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నిర్మలా జ్యోతి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు



బలంగా ఢీ కొనడంతో అతుక్కుపోయిన టిప్పర్, లారీ

రావులపాలెం: సాంకేతిక లోపంతో రోడ్డుపై ఆగిపోయిన లోడు లారీని అదే మార్గంలో వస్తున్న టిప్పర్ లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. సోమవారం అర్ధరాత్రి రావులపాలెం జాతీయ రహదారిపై గౌతమి కొత్త బ్రిడ్జ్ అప్రోచ్ రోడ్డు సమీపంలో ఈ ఘోర ప్రమాదం సంభవించింది. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం మందపాడుకు చెందిన పేపేటి వెంకట శ్రీనివాసరావు (48), అతని కొడుకు నాగసత్యసాయి (26) ఇద్దరు సొంత లారీని తిప్పుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. దీనిలో భాగంగా వారం క్రితం భీమవరం నుంచి చేపల లోడుతో కోల్‌కతాకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వైజాగ్‌లో తౌడు లోడ్ చేసుకుని మందపాడుకు పయనమయ్యారు. రావులపాలెం గౌతమి కొత్త బ్రిడ్జి దాటేసరికి వారి లారీ బ్రేక్ డౌన్ కావడంతో మరమ్మతు చేసుకునేందుకు డ్రైవర్, క్లీనర్ అయిన తండ్రీ కొడుకులు ఇద్దరూ కిందకి దిగి లారీ వెనక టైర్ల వద్ద మరమ్మతులు చేస్తున్నారు. అదే మార్గంలో వెనుక నుంచి వచ్చిన టిప్పర్ లారీ వీరి లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రీకొడుకులు ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఇదిలా ఉండగా టిప్పర్ లారీలో డ్రైవర్, క్లీనర్లుగా ఉన్న జుత్తుగ రవి, ఎల్లె మణికుమార్ బావ, బావమరుదులు. వీరిది ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక. వీరు రావులపాలెంకు చెందిన ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి గ్రావెల్ వేసుకుని వస్తుండగా బ్రిడ్జి సమీపంలో ఆగి ఉన్న లారీని గుర్తించకపోవడంతో బలంగా ఢీ కొట్టారు. దీంతో రెండు లారీల మధ్య ఇరుక్కుపోయారు. తీవ్ర గాయాలతో రెండు లారీల మధ్య వారు నరకయాతన అనుభవించారు. సమాచారం తెలుసుకున్న పోలీస్, హైవే సిబ్బంది సంఘటన ప్రాంతానికి చేరుకుని రెండు భారీ క్రేన్ల సాయంతో సుమారు రెండు గంటల పాటు తీవ్రంగా శ్రమించి క్షతగాత్రులను బయటకు తీసి రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కాకినాడ ఆసుపత్రికి తరలించినట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. ఒకే ప్రమాదంలో ఒక కుటుంబంలోని తండ్రి కొడుకులు మృత్యువాత పడగా, మరో కుటుంబంలోని బావ, బావమరుదులు తీవ్ర గాయాలు పాలవడం తీవ్ర విషాదాన్ని నింపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ్ కుమార్ తెలిపారు.

ఇన్సూరెన్స్ కంపెనీకి మొట్టికాయ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వినియోగదారుని క్లెయిమ్‌ను చట్ట విరుద్ధంగా తిరస్కరించిన యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీకి జాతీయ వినియోగదారుల కమిషన్ మొట్టికాయ వేసింది. వినియోగదారునికి రూ. 5,22,30,661 చెల్లించాలని సదరు సంస్థకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలను నగరానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది జీ.రోనాల్డ్ రాజు మంగళవారం పత్రికలకు విడుదల చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన కాట్రెడ్డి సురేష్‌కుమార్ హైదరాబాద్‌లోని చైతన్యపురిలో సురేష్ ఫార్మా, గామీ ఫార్మా అనే రెండు ఔషధాల తయారీ సంస్థలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2015వ సంవత్సరం జనవరి 26వ తేదీన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి సంస్థలోని సరుకు మొత్తం దగ్ధమైంది. దీనిపై ఆ సంస్థల ఇన్సూరెన్స్ కంపెనీ అయిన యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీకి సంస్థ యజమాని సురేష్ నష్టపరిహారం కోసం క్లెయిమ్ చేశారు. అయితే అగ్ని ప్రమాదం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల జరగలేదని, మనుషులు పెట్రోల్ ఉత్పత్తులు వాడి అగ్ని ప్రమాదం సృష్టించారని పేర్కొంటూ ఇన్సూరెన్స్ కంపెనీ సదరు క్లెయిములను అక్రమంగా తిరస్కరించింది. దీనితో ఫార్మా సంస్థల యజమాని సురేష్ న్యాయవాది రోనాల్డ్ రాజు ద్వారా జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో రెండు కేసులు దాఖలు చేశారు. ఈ కేసుల్లో సుదీర్ఘ వాదనల అనంతరం ఈనెల 29వ తేదీన తీర్పు వెలువరించింది. సురేష్ ఫార్మాకు నష్టపరిహారంగా రూ.2,22,36,413లను, భవనానికి జరిగిన నష్టానికి రూ.13,19,996లను 6 శాతంవడ్డీతో సహా 8 వారాల్లో చెల్లించాలని తీర్పు వెలువరించింది. అలాగే గామీ ఫార్మాకు నష్టపరిహారంగా రూ.1,13,96,104.80 పైసలకు 6 శాతం వడ్డీతో చెల్లించాలని తీర్పు వెలువరించింది.